

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నెల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనంగా రూ.26వేల అందజేయాలని డిమాండ్ చేస్తూ ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం విఆర్‌సి క్రీడా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టివివి ప్రసాద్, కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పిల్డ్ అసిస్టెంట్లకు కనీసవేతనంగా రూ. 26 వేలు అందజేయాలని , మ్యాన్‌డేస్ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, ప్రతి ఒక్కరికి ఎఫ్‌టిఈ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇరగాలయ్య ,ఖాదర్ బాషా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం రాజా ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా నాయకులు రమేష్ కిషోర్ శీను రమణయ్య అశోక్ పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డు జర భద్రం..!

- కార్డులు 7.57 లక్షలు, ఆస్పత్రులు120
- ప్రభుత్వాస్పత్రులు 64, డెంటల్ 28
- కార్పొరేట్ ఆస్పత్రులు కేవలం రెండు
- నేటి నుంచి కార్డుల పంపిణీకి శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రతి చిన్న కార్యక్రమానికి భారీ హంగామా చేస్తుంది. ఎప్పటి నుంచో అమల్లో ఉన్న ఆరోగ్య శ్రీ పథకానికి మెరుగులు దిద్ది పంపిణీ చేయడానికి నానా హడావుడి పడుతోంది. నేడు జిల్లా వ్యాపితంగా ఆరోగ్య శ్రీ నూతన స్మార్ట్ కార్డులను అధికారులు, వైసిపి నేతలు ఇంటింటికి తిరిగి ఇవ్వనున్నారు. రూ.5 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి డాక్టర్ వై.ఎస్.ఆర్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని గొప్పలు చెబుతున్నారు. వెయ్యిరూపాయలు బిల్లు దాటితే ఆరోగ్య శ్రీ కింద అమలు చేస్తామని చెప్పినా ప్రయోజనం లేదు. ఒకేసారి 3,257 వ్యాధులకు వైద్యం చేస్తామని చెబుతున్నా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎక్కడా పథకం అమలు కావడం లేదు. ఉచితంగా వైద్య సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందిస్తున్నామని సంబరపడుతున్నారు. జిల్లా వ్యాపితంగా 7,57,754 కార్డులు జారీ చేస్తున్నారు. 120 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నామని చెబుతున్నారు. అందులో 64 ప్రభుత్వ, 28 ప్రయివేటు, 28 డెంటల్ ఆసుపత్రులున్నాయి. ఇందులో కేవలం రెండు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే పథకం అమలు జరుగుతుంది. అందుకే ప్రజలు ఆరోగ్యశ్రీ కార్డులు భద్రంగా ఇళ్లలో దాచిపెట్టుకోవాలని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఆరోగ్య శ్రీ పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005లో ప్రారంబించారు. పేద ప్రజలకు ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని అక్కడే ఈ పథకం ద్వార అమలు చేస్తామని ప్రకటించారు. పెద్ద పెద్ద చికిత్సలు ఒకప్పుడు ఈ పథకం కింద జరిగాయి. పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. జిల్లాలోని దాదాపు అన్ని అపోలో, కిమ్స్, సింహపురి, నారాయణతోపాటు పెద్ద ఆసుపత్రులు ముందుకొచ్చి పనిచేశాయి. అనేక మంది పేదలకు ఈ పథకం ఉపయోగపడింది. రాను రాను ఈ పథకం నీరుగారి పోయింది. గతంలో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్యసేవలందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆరోగ్య శ్రీ పథకాన్ని కొన్ని ఆస్పత్రులు దుర్వినియోగం చేశారు. నెల్లూరు నగరంలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో గుండె, కిడ్నీ, కళ్లు, కాలేయం ఒక్కటేమిటి అనేక పెద్దపెద్ద ఆపరేషన్లు ఉచితంగా చేశారు. 1050 నుంచి 2350 వ్యాధుల వరకు ఉచితంగా చేస్తామని గతంలో ప్రకటిం చారు. తాజాగా జగన్ మోహన్‌రెడ్డి ఐదు లక్షల ఆదాయం ఉన్న ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షలు ఉచిత వైద్య సేవలం దిండానికి ప్రభుత్వం ముందు కొచ్చింది. గతంలోనే ముఖ్య మంత్రి ప్రజలకు అనేక హామీలిచ్చారు. వెయ్యి రూపాయలు బిల్లు దాటితే ఆరోగ్య శ్రీ కింద చూస్తామని ప్రకటిం చారు. ఇది ఎక్కడా అమలుకు నోచు కోవడం లేదు. ఎందరో నిరు పేదలు అప్పులు చేసి వడ్డీలకు తెచ్చుకొని, ఆస్తులు అమ్ముకొని వైద్య సేవలం దించుకుంటు న్నారు. తాజాగా 3257 వ్యాధులను ఆరోగ్యశ్రీ పథకం కింద చేర్చారు. జిల్లాలో 7,57,754 మందికి కార్డులు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి జిల్లా వ్యాపితంగా ఆధికారులు, వైసిపి నేతలు ఇంటింటికి వెళ్లి కార్డులు ఇవ్వనున్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం అమలు విషయంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.

ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డును పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

7.75 లక్షల కార్డులు..రెండే ఆసుపత్రులు..!

ఆరోగ్య శ్రీ పథకం ముఖ్యోద్దేశం పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించడం . ఒకప్పుడు బాగానే అమలు జరిగింది. ప్రతేడాది బిల్లులు సకాలంలో చెల్లిస్తుండడంతో కార్పొరేట్ ఆసుపత్రులతోపాటు, జిల్లాలోని పెద్ద ఆసుపత్రుల సేవలందించాయి. ఇప్పుడు ఆరోగ్య శ్రీ బిల్లులు రాకపోవడంతో అపోలో, కిమ్స్ వంటి ఆసుపత్రులు వెనక్కి వెళ్లిపోయాయి. మెడికోవర్, నారాయణలో ఈ సేవలు లేకపోతే ఆసుపత్రులు మూసుకునే పరిస్థితులున్నాయి. జిల్లావ్యాపితంగా లక్షల్లో కార్డులిచ్చారు. 120 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ అమలు చేస్తున్నారు. ఇందులో 64 ప్రభుత్వ ఆసుపత్రులున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యసేవలందిస్తారు. సరైన మౌలిక సదుపాయాలు లేవు. ఇక్కడ ఆరోగ్య శ్రీ అమలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. 28 ప్రయివేటు ఆసుపత్రులు, మరో 28 డెంటల్ ఆసుపత్రులు ఆరోగ్య శ్రీ కింద ఉన్నాయి. నగరంలో వీధికో డెంటల్ ఆసుపత్రులున్నాయి. రోగులు లేకపోవడంతో ఎప్పుడైనా బిల్లులు వస్తాయని ఆరోగ్య శ్రీ అమలు చేస్తున్నారు. ప్రజలు చిన్న చిన్న వ్యాధులకు చికిత్స చేయించుకున్నారు. పెద్ద జబ్బులు చేస్తే కార్పొరేట్ వైద్యం కోసం చూస్తారు. అదే అందనప్పుడు, రూ.25 లక్షలైనా ఒక్కటే, 3257 వ్యాధులైనా ఒక్కటే. జిల్లాలో ఆరోగ్య శ్రీ పథకం కింద కేవలం రెండు కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రమే ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆరోగ్య శ్రీ కార్డులు ఇళ్లలో పెట్టుకొని రోజు చూసుకోవడం తప్ప పెద్దగా ప్రయోజం ఉండదని ప్రతిపక్షాలు, ప్రజలు విమర్శిస్తున్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

ఏడో రోజు కొనసాగిన నిరసనలు - భారీ ప్రదర్శన, మానవహారం

నెల్లూరులో ..

ప్రజాశక్తి-నెల్లూరు : హామీల అమలు కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం నాటికి సమ్మె ఏడో రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరుతూ గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆర్‌డిఓ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఎసి సెంటర్, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం సెంటర్, బోసుబొమ్మ సెంటర్, రైల్వే ఫీడర్స్ రోడ్డు సెంటర్ ప్రాంతాల మీదుగా ఆర్‌డిఓ కార్యాలయం వరకు నిర్వహించారు. నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కార్యకర్తలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆర్‌డిఓ కార్యాలయ ఆవరణం కిటకిటలాడింది. ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు బైఠాయించి సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనంగా రూ.26 వేలు అందజేయాలని, గ్రాట్యుటీ కల్పించాలని నినదించారు. సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి ఎం మోహన్ రావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు పని ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో గొడ్డు చాకిరి చేస్తున్నా వారి పట్ల ప్రభుత్వం దయలేకుండా వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం కన్నా మెరుగైన జీతం ఇస్తామని చెప్పిన సిఎం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె .అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తాత్సారం చేయకుండా అంగన్‌వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, బత్తల కష్ణయ్య రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్ శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి అన్నపూర్ణమ్మ, రూరల్ కార్యదర్శి షాహినా బేగం సిఐటియు నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి రాంబాబు ఐద్వా నగర కార్యదర్శి కె పద్మ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై సుజాతమ్మ అంగన్వాడి నాయకులు ఎల్వి శేషమ్మ, కామాక్షి, సంపూర్ణమ్మ, స్వర్ణలత, నాగభూషణమ్మ, ప్రమీల, సుగుణమ్మ ఉన్నారు.

కందుకూరు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఏడు రోజుల నుంచి వారు చేస్తున్న సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదు. దీంతో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కందుకూరులో భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. గత ఏడు రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చర్చలలో తమకు సరైన హామీ ఇవ్వక పోవడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద కందుకూరు అర్బన్, కందుకూరు రూరల్, వలేటివారిపాలెం, లింగసముద్రం,ఉలవపాడు, గుడ్లూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సుమారు 600 మంది సోమవారం సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు జీవిబి కుమార్,ఎస్.ఏ.గౌస్ తోపాటు అంగన్వాడి లీడర్లు ఆర్.సరస్వతి, వాకా.లతా రెడ్డి, ప్రభావతి మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చి తమ సమస్యలను వివరించారు. పట్టణంలో భారీ ప్రదర్శన అనంతరం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. సిఐటియు నాయకులు డి రామ్మూర్తి,ఎస్ పవన్ కుమార్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దువ్వూరి జాన్, డిఎం రాయుడు, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర నాయకురాలు ఏ. అనురాధ, కందుకూరు, ఉలవపాడు ప్రాజెక్టు లీడర్లు ఎస్ కే. రహంతున్నీసా, రాజేశ్వరి, సిహెచ్ ఇందిరావతి, అన్ని మండలాల నాయకులు ఎస్ కే పద్మజ, బీ మార్తమ్మ, ఉమామహేశ్వరి,గీత, సిహెచ్ పద్మజ, ఎం పద్మ, జి శశి, నాగమణి, సిహెచ్ రమాదేవి, కాకర్లపూడి శైలజ, డి వరలక్ష్మి, డి రమాదేవి,పర్రె తిరుపతమ్మ, పంతగాని రమణ ఉన్నారు.

కందుకూరులో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి

ప్రజాశక్తి -గుడ్లూరు : మహిళా కూలీలతో వెళ్తున్న ఆటోని కర్ర లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటోలో ఉన్న ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందారు. మరో నలుగురికి గాయాలైన సంఘటన సంఘటన గుడ్లూరు నుంచి పూరేటిపల్లి వెళ్లే రహదారిలో ఆదివారం రాత్రి జరిగింది. గాయపడిన వారిని కందుకూరు ఏరియా వైద్యశాలకు 108 అంబులెన్స్ ద్వారా తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను గుడ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుడ్లూరు ఎస్‌సి కాలనీకి చెందిన 18 మంది మహిళ కూలీలు సీతారాంపురం దగ్గర ఉన్న నందలపూరులో వరి నాట్లు వేసేందుకు ఆదివారం ఉదయం తరలి వెళ్లారు. సాయంత్రం పనులు ముగిశాక అందరూ ఆటోలో గుడ్లూరుకు బయలుదేరారు. పూరేటిపల్లి రహదారిలో వెళ్తుండగా కర్ర లోడుతో వస్తున్న ట్రాక్టరు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మహిళా కూలీలు కింద పడిపోయారు. దీంతో గాయాలు పాలయ్యారు. రోడ్డు మీద పడిన మహిళల్లో గద్దె వెంకమ్మ(50)అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన వారిని 108 అంబులెన్స్ లో కందుకూరు తరలించగా అందులో సలోమి అనే మహిళ ఆరోగ్యం క్షీణించడంతో ఒంగోలు వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉండగా ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో సలోని (35) మృతిచెందింది. గాయపడ్డవారిలో వరమ్మ, ,రమణమ్మ మరో బాలిక ఉంది. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా కందుకూరు విద్యుత్ ఆఫీస్ సెంటర్లో సోమవారం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారం భించారు. విద్యుత్ దుబారాను తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియ జేసేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంఎల్ఎ తెలిపారు. విద్యుత్‌ను ఆదా చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కందుకూరు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీరయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యుగంధర్ విజయ బాబు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ వెంకటరామయ్య, ఏ ఈ నరసింహం ఉన్నారు.

క్రీడల్లో 'ప్రకాశం' విద్యార్థినుల జయభేరి

ప్రజాశక్తి-కందుకూరు : పాలిటెక్నిక్ (డిప్లమో) విద్యార్థినులు సైతం జిల్లా స్థాయిలో జరిగిన క్రీడల పోటీల్లో సత్తా సాటి రాష్ట్ర, జిల్లా విజేతలుగా నిలిచారని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య సోమవారం వెల్లడించారు. ఒంగోలు సమీపంలోని ఈతముక్కల ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కాలేజీలో రెండు రోజులు పాటు జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీలలో అథ్లెటిక్స్‌లో కొన్ని విజయాలు సాధించారన్నారు. విద్యార్థుల వివరాలు వెల్లడించారు. పర్యవేక్షకులు మీరావలి,పిడి సుబ్రహ్మణ్యం తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - లింగసముద్రం : కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు నీలకంఠశాస్త్రి మెమోరియల్ ప్రతిభ అవార్డులను సోమవారం అందజేసింది. పాఠశాలలో హెచ్‌ఎం ఉమ్మడిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రవాసభారతీయుడు కదిరి పార్థసారధి తరుపున ఆయన సోదరుడు నరసింహరావు 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. మరో పాఠశాల పూర్వ విద్యార్థి కదిరి వెంకట్రావు గత ఏడాది పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థా నాలల్లో నిలిచిన విద్యార్థులకు 7, 500, 5వేలు అందజేశారు. ఆర్మీలో పనిచేస్తున్న హవల్దారు తిరుమణిశెట్టి కోటయ్య పాఠశాలకు అందజేశారు. ప్రధానోపాధ్యయులు మాధవరావు కోటయ్యను అభినందించారు ఎంఇఒ-2 శివ కుమార్, ఎస్‌ఎంసి చైర్మన్ మాచేపల్లి మాల్యాద్రి,మాజీ సర్పంచ్ నాగేశ్వ రరావు, పా ఠశాల ఉపాధ్యాయులు కిలారి వెంకటేశ్వర్లు, కొండయ్య, కె.ప్రభాకర్, అశోక్, నారాయణ ఉన్నారు.

అర్హులందరికీ జగనన్న ఆరోగ్య శ్రీ కార్డులు

వలేటివారిపాలెం : అర్హులందరికీ జగనన్న ఆరోగ్య శ్రీ కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిపి మైనిక, జెడ్‌పిటిసి ఇంటూరి భారతి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమ వారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య ప్రజా సమస్యల పరిష్కా రమే ధ్యేయంగా సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. ఎంపిపి కొనుగోటి మౌనిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశం దష్టికి తీసుకొచ్చారు కలవల్ల, నలదలపూరు గ్రామాల సమస్యల గురించి ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రస్తావించారు. జెడ్‌పిటిపి ఇంటూరి భారతి, ఎంపిపి మౌనిక మాట్లాడారు. ఎంపిడిఒ రఫీ మహ్మద్, తహశీల్దార్ సుందరమ్మ పాల్గొన్నారు. వారు అభివద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. సర్పంచులు ఎంపీటీసీలు వైసీపీ నాయకులు పరిటాల వీరాస్వామి అనుమోలు వెంకటేశ్వర్లు ఇంటూరి హరిబాబు ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి, ఎంపిపి

ఉలవపాడు : ఉప ఎంపిపి సయ్యద్ ఫజులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉలవపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిడిఒ చెంచమ్మ, ఎంపిపి మస్తానమ్మ ఇతర అధికారులు ఉన్నారు.

'సోమిరెడ్డి'పై వైసిపి గూండాగిరి..!

- ట్రాన్స్‌జెండర్స్, గూండాలతో దాడికి యత్నం
- అడ్డుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు.
- భారీగా పోలీసుల మోహరింపు
- కొనసాగుతున్న సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-పొదలకూరు : జిల్లా రాజకీయాల్లో ఎప్పుడు, ఎన్నడు చూడని సంస్కృతిని అధికారపార్టీ నేతలు ప్రోత్సహిస్తున్నారు. మైనింగ్ అక్రమాలపై సీనియర్ రాజకీయ నేత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మూడ్రోజుల నుంచి సత్యాగ్రహ నిరసన దీక్ష చేస్తున్నారు. దీక్షను భగ్నం చేయడానికి నెల్లూరు నుంచి సుమారు 200 మంది ట్రాన్స్‌జెండర్స్, మరో 50 మంది గూండాలను దించారు. అధికారపార్టీ నేతల ప్రోత్సాహంతో ఈ దాడులకు పాల్పడగా, టిడిపి నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోమిరెడ్డి కారు అద్దాలు ధ్వంసమైనట్లు తెలిసింది. ఈ సంఘటలనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొద్ది రోజులుగా అక్రమ మైనింగ్‌పై పోరాటం చేస్తున్నారు. మూడ్రోజుల నుంచి పొదలకూరు మండలం, తాటిపర్తి రుస్తుం మైనింగ్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేస్తున్నారు సోమవారం నిరసన తెలుపుతున్న సోమిరెడ్డి శిబిరాన్ని ధ్వంసం చేయాలని రెండు వందల మంది పైగా ట్రాన్స్‌జెండర్స్, 50 మంది గుండాలు శిబిరం పై దాడి చేయాలని ప్రయత్నం చేశారు. అధికారపార్టీ ముఖ్యనేత ఒకరు ఈ మైనింగ్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలున్నాయి. దీక్షలతో 12 టిప్పర్లు, 6 హిటాచీలు అక్కడే నిలిచిపోయాయి. వైసిపి రాష్ట్ర స్థాయి ముఖ్యనేతకు చెందిన వాహనాలను ఇక్కడ నుంచి విడిపించి పంపాలనే ఉద్దేశంతో కొందరు ఈ దీక్ష శిభిరాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. సాయంత్రం నెల్లూరులో పెద్దఎత్తున గూండాలు, ట్రాన్స్‌జెండర్స్ అక్కడకు చేరుకున్నారు. మైనింగ్‌కు వారికి ఎలాంటి సంబందం లేదు. అయినప్పటికీ వైసిపి నేతల ప్రోత్సాహంతో అక్కడకు వచ్చినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న టిడిపి నేతలు అక్కడకు చేరుకున్నారు. నెల్లూరు రూరల్ టిడిపి నేతలకు విషయం తెలియడంతో పెద్ద ఎత్తున వచ్చారు. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. దాడిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కారు అద్దాలు ధ్వంసమైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ అక్కడ పనిచేస్తున్న 12 టిప్పర్లు 6 హిటాచీలు వివిధ వాహనాలు ఉన్నాయని, వాటిని తీసుకెళ్లేందుకు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈ శిబిరంపై దాడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్ల విలువైన క్వార్జ్‌ను అక్రమంగా తవ్వి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లాలో రోజుకు సుమారు 4 కోట్ల రూపాయల విలువైన వెయ్యి టన్నుల క్వార్జ్‌ను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. తాటిపర్తి పంచాయతీ పరిధిలోని రుస్తుం, భారత్ మైకా గనుల్లో క్వార్జ్ తవ్వకాలను శనివారం ఆయన పరిశీలించారు. గనులకు సమీపంలోనే 50 గిరిజన కుటుంబాలు ఉన్నాయని పేలుళ్ల ధాటికి రాళ్లు ఎగిరి వారి ఇళ్లపై పడుతున్నా అక్రమార్కులు పట్టించుకోవడం లేదన్నారు. భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత గ్రామానికి సమీపంలోనే ఇంత దారుణం జరుగుతున్నా ముడుపులు తీసుకుని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సోమిరెడ్డి శిబిరంపై దాడి జరుగుతుందని తెలుసుకున్న నెల్లూరు రూరల్ మండలంలోని వివిధ గ్రామాలు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరారు. పోలీసులు శిబిరం వద్దకు పంపకుండా చెదర గొడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు అక్కడికి తరలివస్తున్నారు.

పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న టిడిపి నేత సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

అక్రమ మైనింగ్‌తో రూ. కోట్లు దోపిడీ

అధికారపార్టీ నేతలే సూత్రధారులు - ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ : సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతోన్న అక్రమ మైనింగ్‌కు నిరసనగా జిల్లా టీడీపీ నేతలు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వేపల్లి లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను నిరసిస్తూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేస్తున్న నిరసన దీక్ష తెలిసి కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ధ్వజమెత్తారు.జే సీ సమక్షంలో మైనింగ్ డీడీ సర్వేపల్లి లో జరుగుతుండేది అక్రమ మైనింగె నని స్పష్టం చేసినట్లు మీడియా కి తెలిపారు. కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు రాజా నాయుడు, జెన్నీ రమణయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ, చెముకుల కష్ణ చైతన్య, భూలక్ష్మి, అమ్రుల్లా, దర్శి హరి కష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకట శేషు ఉన్నారు.

మైనార్టీల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

'ఆవాజ్' రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-నెల్లూరు : మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తు న్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు పాల్గొన్నారు. తమ హక్కుల కోసం రాబోయే రోజుల్లో మైనారిటీలందరూ కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మైనారిటీలకు ఇస్తున్న స్కాలర్షిప్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయగా, సబ్సిడీ స్కీములను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తినే తిండి పైనా, కట్టుకునే దుస్తులపైనా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ మాట్లాడుతూ మైనార్టీల హక్కుల కోసం రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. మైనారిటీ ఫెడరేషన్ ఆఫ్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు జియావుల్ హక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని రద్దు చేస్తామని రాజ్యసభలో ప్రైవేటు బిల్లు పెట్టడం దారుణమన్నారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అజీజ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో హక్కులపై మాట్లాడకపోతే రాబోయే రోజుల్లో చాలా దుర్భరమైన పరిస్థితిలో మైనార్టీలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నరేంద్ర మైనారిటీలు విద్యకు చాలా దూరంగా ఉన్నారని తెలిపారు. లాయరు షేక్ అమీదా మాట్లాడారు. ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ జానీ భాష, షేక్ మునీర్, షేక్ నజీర్, షేక్ ఫయాజ్, సయ్యద్ రవూఫ్, మహమ్మద్ సర్దార్ ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రశీద్

పేదల అభివృద్ధికి జగనన్న కృషి : మానుగుంట

ప్రజాశక్తి-కందుకూరు : పేద, ధనిక వర్గాల మధ్య అసమానతలను రూపుమాపేందుకు ఆర్థికంగా బల హీనంగా ఉన్న వర్గాలకు వివక్షత లేకుండా సంక్షేమాన్ని అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంఎల్ఎ మానుగుంట మహీధరరెడ్డి తెలిపారు. కందుకూరు బిలాల్ నగర్ సచివాలయం వద్ద జరిగిన సభలో మహీధర్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇరవై వేల కోట్ల రూపాయలు సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఇంకా జెసిఎస్ కోఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మాట్లాడారు. మున్సిపాలిటీ మేనేజర్ చంద్రమోహన్ అధ్యక్షత వహించారు. సచివాలయం పరిధిలో సంక్షేమ డిస్ ప్లే బోర్డును పార్టీ జెండాను ఆవిష్కరించారు. కష్ణ బలిజ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాశం కుమారి, బి సి సెల్ జిల్లా అధ్యక్షులు జాజుల కోటేశ్వరరావు, రాష్ట్ర యువజన కార్యదర్శి గణేషం గంగిరెడ్డి, సచివాలయం కన్వీనర్లు పాశం కొండయ్య, పల్నాటి చెన్నయ్య, భోగిశెట్టి దత్తాత్రేయ, వైసిపి నేత పాశం పాకనాటయ్య, షేక్ హమీద్ ఉన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకలు

కందుకూరు : కందుకూరు నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంఎల్ఎ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ, ఎర్రగొండపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు హాజరయ్యారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తరలివచ్చిన 220 మంది పాస్టర్లకు ఇంటూరి నాగేశ్వరరావు దుస్తులు పంపిణీ చేశారు.టిడిపి తరపున ఇంటూరి నాగేశ్వరరావు గెలవాలంటూ పాస్టర్లు ప్రార్థనలు చేశారు. ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు నూకసాని బాలాజీ, ఎరిక్షన్ బాబు మాట్లాడారు. నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ దేవ ప్రసన్న, టౌన్ చర్చ్ పాస్టర్ గడ్డం జాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు వల్లేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం తదితరులు ఉన్నారు.

రక్తదానం మిన్న

కందుకూరు: సంతమాగులూరు మండలం, కుందుర్తికి చెందిన ఎం శ్రీనివాసులుకు ఒంగోలులో రైలు ప్రమాదంలో కాళ్లు దెబ్బతిన్నాయి.. ఒంగోలు రిమ్స్‌లో చేర్చారు. ఆయనకు అత్యవసరంగా ఎబి పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు కోరగా ఆ రక్తం ఒంగోలులో దొరకలేదు. కందుకూరు రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్ ద్రోణాదుల మనోహర్ తక్షణమే స్పందించి ఒంగోలు రిమ్స్‌కు వెళ్లి రక్త దానం చేశారు. ఆయన్ను పలువురు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

పొదలకూరు : మండలంలోని ఆర్ .వై పాలెం పంచాయతీ సెక్రెటరీ గా పని చేస్తున్న ఉట్లపల్లి చంద్రశేఖర్(48) రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి మతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు పొదలకూరు నుంచి స్వగ్రామమైన ఏటూరుకు బైకుపై వెళ్తుండగా పొదలకూరు పంచాయతీ పరిధిలోని వెంకయ్య స్వామి (చిట్టేపల్లి తిప్ప)గుడి వద్ద బర్రెను ఢీకొనడంతో అక్కడికక్కడే మతి చెందాడు. మృతుడు ఉట్లపల్లి చంద్రశేఖర్ ఆర్ వై పాలెం పంచాయతీ సెక్రెటరీ గా విధులు నిర్వహిస్తున్నారు. చంద్రశేఖర్ మతి పట్ల స్థానిక ఎంపిడిఒ నగేష్ కుమారి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు.

మత్స్యకార కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు: పట్టణంలోని ముత్తరాశిపాలెంకు చెందిన మత్స్యకార సంఘం సీనియర్ సభ్యుడు చింతరబోయిన మాల్యాద్రి అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి తన నివాసంలో మృతి చెందారు. మాల్యాద్రి భౌతికకాయాన్ని సోమవారం మత్స్యకార సంఘం సభ్యులు సందర్శించి నివాళులు అర్పించారు. మత్స్యకార సంఘం తరపున మట్టి ఖర్చులకు గానూ, రూ. 10'000 ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. మత్స్యకార సంఘం నాయకులు, సభ్యులు రుద్రబోయిన నరశింగరావు, మోసంగి కోటేశ్వరరావు, పోతురాజు ఉన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : విద్యుత్ అతిగా వాడితే భవిష్యత్తులో అంధకారం అవుతుందని ఆత్మకూరు ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.జనార్ధన్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం నుండి మున్సిపల్ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూట్ ఇంజనీరు జనార్ధన్ మాట్లాడుతూ విద్యుత్ పొదుపు చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు సురేష్, ఎఇ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సోమవారం ఎపిటిఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు ఎ.సురేంద్ర రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఖాళీగా ఉన్న వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలన్నారు. వెంటనే పిఆర్‌సి కమిటీ విధులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, 2023 జూలై నుండి 30శాతం మధ్యంతర భృతి అమలయ్యేలా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర కౌన్సిలర్ ఎం సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా సబ్ కమిటీ సభ్యులు ఎస్‌కె కరీం మొహిద్దీన్, రామ సుబ్బారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించి మండల శాఖ గౌరవాధ్యక్షులుగా పి.శివరాంరెడ్డి, అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి వెంకటేశ్వర్లు రాజు, అసోసియేట్ అధ్యక్షులు పి.నాగరాజు, అదనపు కార్యదర్శి ఎన్.శివయ్య, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.శివశంకరయ్య, ఎన్‌సి వెంకటేశ్వర్లు, కె.సుందరరామిరెడ్డి, కె పెంచలయ్య, కెబివి సుబ్బారెడ్డి, ఎం.వి సుబ్బారెడ్డి, పి శ్రీనివాసులు, పి.సుధాకర్, వై.హరికృష్ణ, కె.విజయ్‌కుమార్, మహిళా కార్యదర్శులు రాజేశ్వరి, సరస్వతి, శ్రీదేవి, శాంతి, మాధవి, సుజాత, పద్మ అపర్ణ, ముని కృష్ణమ్మ, లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యక్షులుగా జీవి రమణ, వెంకటేశ్వర్లు, శంకర్, నాయబ్, ఆర్.కృష్ణకుమారి, కార్యదర్శులు వెంకటరమణయ్య, సిహెచ్.మల్లికార్జున, కరీం మొహిద్దీన్, వెంకట రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'సాయి నర్సింగ్' కళాశాల ఎదుట నిరసన

ప్రజాశక్తి-కావలి : కావలిలోని శ్రీ సాయి నర్సింగ్ కళాశాల ఎదుట సోమవారం బిజెవైఎం నాయకులు నిరసన చేపట్టారు. కావలి శ్రీ సాయి నర్సింగ్ కాలేజీలో గత రెండురోజులుగా విద్యార్థునుల ఫీజు కోసం యాజమాన్యం మొండిపట్టు విడవలేదు. విద్యార్థినుల ఆందోళనతో రెవెన్యూ, మెడికల్ అధికారులు వచ్చి, చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో విద్యార్థినులు కళాశాలలోకి వెళ్లలేకపోయారు. ఈ విషయమై సోమవారం బిజెవైఎం నాయకులు వచ్చి. విద్యార్థుల నుండి పరీక్ష ఫీజు కట్టించుకోవాలని కోరారు. యాజమాన్యం స్పందించనందున వారు ఆగ్రహించి ధర్నా చేపట్టారు. అప్పటికీ యాజమాన్యం మొండి పట్టు వీడనందున ఆగ్రహంతో బిజెవైఎం నాయకులు కళాశాలలోని బల్లలు, కుర్చీలు విరగ్గొట్టి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుత్తా అశోక్ నాయుడు, మురుగా నరేష్, తాళ్లూరు నవీన్ కుమార్, సాయి కృష్ణ, మాధవరావు, కేతిరెడ్డి విష్ణుతేజరెడ్డి, కామినేని ఉదయలక్ష్మి, మంద కిరణ్ కుమార్, కూరాకుల సవేంద్ర, తూమాటి తిరుపతి స్వామి, మందా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి వైద్యుడికి స్థానం దక్కడంపై హర్షం

ప్రజాశక్తి-ఉదయగిరి : వైసిపి డాక్టర్ల విభాగంలో ఉదయగిరి వైద్యుడు షేక్ మస్తాన్‌కు స్థానం దక్కడంపై ఉదయగిరి వైసిపి యువ నాయకులు షేక్.గాజుల షర్ఫుద్దీన్ పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పలువురిని డాక్టర్ల విభాగంలో వివిధ హోదాల్లో నియమితులవడం మెట్ట ప్రాంతానికి ఎంతో సంతోషదాయకమన్నారు. జిల్లా డాక్టర్ విభాగాల్లో ఉదయగిరికి చెందిన షేక్.మస్తాన్‌ను జనరల్ సెక్రటరీగా, సెక్రటరీగా షేక్ అహ్మద్, వై.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీలుగా జి.వెంకటరామయ్య, మధులను ఎంపిక చేశారని ఆయన వివరించారు. అనంతరం కేకులు కట్ చేసి వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉదయగిరి ప్రజలు యువత అధిక సంఖ్యలో పాల్గొని వారికి అభివందనాలు తెలిపారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నెల్లూరు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి యామిని ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ కె వాణి ఆధ్వర్యంలో సోమవారం రేబాల నేతాజీ నగర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి మాట్లాడుతూ వద్ధాప్యంలో ఎలాంటి వారి రక్షణ కోసం 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల సీనియర్ సిటిజెన్ల పోషణ సంక్షేమ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే మా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె మహేంద్ర, ఎంపీడీఓ డివి నరసింహారావు, పంచాయతీ సెక్రటరీ పి.శ్యామసుందర్, సర్పంచ్ ఎల్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ పి రమణమ్మ, ఇఒపిఆర్‌డి రామ్మోహన్ పాల్గొన్నారు.

మదరసా నిర్మాణానికి నగదు వితరణ

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం నేతాజీనగర్లో నిర్మాణంలో ఉన్న మసీదు, మదరసాకు కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకష్ణారెడ్డి సోమవారం తన సొంత నిధులు నుంచి 25వేలు రూపాయలను మత పెద్దలు ఇమ్రాన్ సూఫీ, జుబేర్ బాషాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మసీదు, మదరసా శంకుస్థాపన కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే సమక్షంలో వీటి నిర్మాణానికి 25 వేలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం ఆ నిధులను వారికి అందజేయడం జరిగిందన్నారు.

ఆరోగ్యశ్రీ రూ.25లక్షలకు పెంపు

ప్రజాశక్తి-కోవూరు : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించి ముఖ్యమంత్రి చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకష్ణారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ప్రజల్లో హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తదితరులు ఉన్నారు.

పథకాలను రైతులు తెలుసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : వ్యవసాయ శాఖలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై రైతులకు అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించడం జరిగిందని మండల వసాయాధికారిణి ఇందిరావతి అన్నారు. కోవూరు మండలం, వేగూరు, లేగుంటపాడు గ్రామాల్లో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్యాధికారి డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం అనేక వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 5 లక్షల వరకు ప్రజలు ఎక్కడైనా ఆరోగ్య సేవలను పొందే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీడీఓ వారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు రఘురామయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్ అభివద్ధిపై ప్రత్యేక దష్టి పెట్టారన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రహీమ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జగదీష్, పలు సూచనలు చేశారు. నాయకులు రామిరెడ్డి తదితరులున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే..

నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, రాజకీయ నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందేనని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఉద్ఘాటించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం గత 8 రోజులుగా నిరవధిక సమ్మె ... అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మెలో పాల్గొని ... ప్రభుత్వం ... సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ... నిరవధిక సమ్మె సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ... వరకు నిరవధిక సమ్మె నిర్వహించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ నిరవధిక సమ్మెలో సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొని అంగన్‌వాడీలకు మద్దతు తెలియజేశారు. సిఐటియు జిల్లా నాయకులు జివి శివప్రసాద్, మండల అధ్యక్షులు ఎ.నాగయ్య, మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దామా పెంచలరావు, ఖాదర్ బాషా, కాంగ్రెస్ నాయకులు వన్నెం నాగరాజు, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మి, మస్తానమ్మ, శ్రీదేవి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ టీచర్లు, హెల్పర్లు న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు చేస్తున్న సమ్మె 7వ రోజు సోమవారం కొనసాగింది. కావలి పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి ఉదయగిరి సెంటర్ మీదుగా ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయం మీదుగా ఐసిడిఎస్ కార్యాలయం వరకు ప్రదర్శన కొనసాగింది. అనంతరం అక్కడే బైఠాయించి సాయంత్రం 4 గంటల దాకా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహనా బేగం, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకిచ్చిన వాగ్దానాలను నేటికీ అమలు చేయకపోగా వారిపై నిర్బంధాన్ని ఉపయోగించాలని చూస్తోందన్నారు. ఇలాంటి నిర్బంధాలకు భయపడేది లేదని, పోరాటాలలో అంగన్‌వాడీ టీచర్లు ఆరితేరి ఉన్నారని తెలియజేశారు. వ్యకాసం నాయకులు టి.మాల్యాద్రి, తుమ్మల వెంకయ్య,

కావలిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సిఐటియు నాయకులు నరహరి, వై.కృష్ణమోహన్, బి.కిష్టయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.రఘురామమ్మ, వజ్రమ్మ, సుభాషిణి, విజయలత, రాధిక, సుకన్య, సౌజన్య, తులసి, 1000మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : న్యాయపరమైన తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన దీక్ష 7వ రోజుకు చేరుకుంది. వీరి దీక్షకు సిపిఎం నాయకుడు కోడె రమణయ్య సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదన్నారు.

గ్రంథి యానాదిశెట్టి మృతి

ప్రజాశక్తి-కావలి : కావలిలో రాజకీయ భీష్ముడు, 4 దశాబ్దాల పాటు కావలి రాజకీయాలను శాసించిన ప్రముఖ ఆర్యవైశ్య ముద్దుబిడ్డ, ప్రస్తుత టిడిపి కావలి పట్టణ అధ్యక్షుడు గ్రంథి యానాదిశెట్టి (72) సోమవారం ఉదయం అనారోగ్యంతో స్థానిక ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తొలుత ఆయన కలికి యానాదిరెడ్డికి ప్రియ శిష్యుడిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, కావలి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, ఆ తరువాత కావలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా చక్రం తిప్పారు.

పలువురు ప్రముఖుల సంతాపం

ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తనఅనుచరులతో వచ్చి, గ్రంథి మృతదేహాన్ని దర్శించి నివాళులర్పించారు. టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బా నాయుడు ఉన్నతమైన నాయకుడిని కోల్పోయామని పేర్కొన్నారు. గ్రంథి యానాశెట్టి పార్థివ దేహానికి మాజీ ఎంఎల్ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పూలమాలలేసి నివాళులర్పించారు. విష్ణు సతీమణి శివప్రియతో కలిసివచ్చి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడారు. ఆయనకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు గ్రంథి శిష్యుడు తిరువీధి ప్రసాద్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జనసేన ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ గ్రంథి యానాదిశెట్టి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జనసేన నాయకులు, రిషికేష్, సుధీర్, కృష్ణయ్య, వెంకయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు. పిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు పసుపులేటి సుధాకర్ నివాళులర్పిస్తూ, కావలి నియోజకవర్గం సీనియర్ టిడిపి నాయకులు గ్రంథి యానాదిశెట్టి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : టిడిపి నేత గ్రంథి యానాదిశెట్టి మృతికి బోగోలు మండలం టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మరణం టిడిపికి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ప్రగడ సాను భూతి తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సిఎం జగన్ పెద్దపీట

మాట్లాడుతున్న ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యానికి పెద్దపీట వేశారని ఆత్మకూరు ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నువ్వూరుపాడు సచివాలయంలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మక ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుండి రూ.25 లక్షల పరిమితి వరకు పెంచే వర్చువల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ కటారి దొరసానమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మొదటి సారిగా ఒక ఆరోగ్య పథకం రూ.25 లక్షల వరకు ఉచితంగా సేవలు అందించే మహోన్నత పథకం ఆరోగ్యశ్రీ పథకమని, ఇప్పటికే కేన్సర్ వంటి వ్యాధులకు పూర్తి ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని తెలియజేశారు. ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు దిక్సూచిగా ఆరోగ్యశ్రీ యాప్ ప్రతి ఒక్కరీ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేపించే కార్యక్రమంతో పాటు సేవలు ఎలా పొందాలి వంటి సందేహాలతో పాటు, ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్న తర్వాత ఆరోగ్య ఆసరా కూడా ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు. వైద్యాధికారి పి.అనూష మాట్లాడుతూ వలంటీర్లు అందరూ యాప్ నందు ఈకెవైసి పూర్తి చేయాలని, ఆరోగ్య సంబంధిత ఏదేని సందేహాలున్నా తమను సంప్రదించాలని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే ప్రభుత్వ ఉన్నత లక్ష్యాన్ని అందరికీ తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సైదా, జిలానీ, ఎంపిటిసి గడ్డం సుచిత్ర, సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు గడ్డం శ్రీనివాసులు రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, రఘురామి రెడ్డి, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగింపు యాత్రలో చెంచలబాబు

ప్రజాశక్తి-ఉదయగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 3132 కిలోమీటర్ల ముగింపు సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్పి చైర్మన్ చెంచలబాబు యాదవ్ పాల్గొన్నారు. సోమవారం గాజువాకలో చేపడుతున్న ముగింపు నారా లోకేష్ పాదయాత్రలో ఆయన పాల్గొని నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి రాక్షస పాలన రాష్ట్ర ప్రజలు విసిగి చెందిన ఉన్నారని అందుకు నిదర్శనమే 3132 కిలోమీటర్ల ముగింపు పాదయాత్ర అని తెలియజేశారు. కార్యక్రమంలో చింతమ శ్రీనివాసులు, జిల్లా టిడిపి నాయకులు, చల్ల ప్రసాద్, తదితర నియోజకవర్గ ముఖ్య టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దారువును కాపాడాలని వినతులు

సిపిఎం ఆధ్వర్యంలో...

దారువును రక్షించండయ్యా..
- నరసాపురం వాసుల ఆవేదన
ప్రజాశక్తి-ఇందుకూరుపేట

సహజ వనరులైన పంచాయతీ దారువును అక్రమార్కుల చెర నుంచి కాపాడలనీ నరసాపురం వాసి రైతు కుటుంబీకులు గంపల రఘురామయ్య కోరారు. సోమవారం సిపిఎం నాయకులతో కలిసి తహశీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 163/1, 164/1లలో ఉన్నా ఎన్నోయేళ్ల నుంచి కర్మకుతులకు, పశువులు నీరు తాగడానికి, వర్షపు నీరు ఇంకుడుగుంతగా ఉపయోగపడుతున్న పంచాయతీ దారువును కొందరు ఆక్రమార్కులు ఆక్రమించుకొని అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారన్నారు. సదరు విషయమై అధికారులకు ఎన్నిసార్లు అర్జీల రూపంలో ఫిర్యాదులు చేసిన ఉపయోగం లేదన్నారు. సరైన పత్రాలు లేకుండా దారువును సదరు ఆక్రమిత వ్యక్తికి ఎలా ఎల్‌పిఎం నెంబరును రీసర్వేలో ఎక్కిస్తారని ప్రశ్నించారు. ఎకరా 10 సెంట్లు ఉన్న దారువు నేడు ఆక్రమణకు గురై 32సెంట్ల వచ్చిందన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు గ్రామస్తులకు ఉపయోగపడుతున్న దారువును ఆక్రమణకు గురికాకుండా కాపాడలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసిసెల్ నాయకులు గంపల అనిల్, డిఒఎఫ్ఐ మండల అధ్యక్షులు చీమకుర్తి శ్రీనివాసులు రెడ్డి, సిపిఎం రైతు సంఘం నాయకులు వెన్ను వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ నుండి దారువును కాపాడాలి : సిపిఐ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన పంచాయతీ దారువును ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని సిపిఐ రైతు సంఘం నాయకులు ఎస్‌కె షాన్‌వాజ్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో సిపిఐ నాయకులతో కలిసి దారువును ఆక్రమణ చెర నుంచి విడిపించాలని ఫిర్యాదును అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ నర్సాపురం గ్రామానికి చెందిన పంచాయతీ దారువు సర్వేనెంబర్ 163/1, 164/1 లో 1.10 సెంట్ల దారువు గతంలో ఉండేదని కాలక్రమేణా కొందరు అక్రమార్కులు దారువును ఆక్రమిస్తూ వస్తున్నారని తెలిపారు. దానిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా కూడా ప్రయోజనం లేదని వాపోయారు. ఒక ఎకరా 10సెంట్లు స్థలాన్ని ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి అధికారులు అండతో కబ్జా చేస్తున్నారని వాపోయారు. పంచాయతీ దారువు స్థలానికి అధికారులు ఎల్‌పిఎం నెంబర్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఎల్‌పిఎం నెంబర్‌తో రిజిస్ట్రేషన్‌కు కూడా సదరు కబ్జాదారుడు పాల్పడుతున్నాడని, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా రన్నారు. సదరు స్థలాన్ని ఉన్నత అధికారులు చొరవ తీసుకొని అడంగల్ నుండి తొలగించా ల్సిందిగా కోరుతున్నా మన్నారు. సదరు ఆక్రమిత దారువులో నూతనంగా నిర్మిస్తున్న అనుమతులులేని కట్టడాన్ని కూడా డమాలిష్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీమకుర్తి శ్రీనివాసులురెడ్డి, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-కావలి రూరల్

విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో 20వ తేదీన నుంచి నిర్వహించే సమ్మె నోటీసును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం ఇస్తానని ఉద్యోగ భద్రత కల్పిస్తామని, హెచ్ఆర్ఎ సౌకర్యం కల్పిస్తానని చెప్పిన హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయక పోవడంతో 20వ తేదీ నుండి సమ్మె చేస్తున్నట్లు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కార్యాలయంలో ఈరోజు సమ్మె నోటీసును అందజేశామన్నారు. పలుశాఖలలో సుమారు 20 సంవత్సరాల నుండి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతులలో పని చేస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ తమకు ఉద్యోగ భద్రత కల్పించలేదని ఈ ప్రభుత్వం ఏర్పడి 5 సంవత్సరాలు కావస్తున్న ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేద న్నారు. పైగా ఇచ్చే జీతాన్ని కూడా తగ్గించారని వాపోయారు. 2014కు ముందు నియమింపబడిన వారందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పి అందులో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను పరిగణలోకి తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని సిఆర్‌ఎంటిఎస్, ఎంఐఎస్, డిఇఒఎస్, మెస్సెంజర్స్, పిటిఐ మొదలగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలో మారంరెడ్డిపల్లి గ్రామంలోని హరిజనవాడలో క్రిస్మస్ వేడుకలలో భాగంగా ఆటల పోటీల నిర్వహణ కోసం స్థానిక టిడిపి నాయకులు కాకర్ల ట్రస్టును సహాయం కోరదాంతో వెంటనే స్పందించిన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ఉదయగిరి నియోజక వర్గ టిడిపి నాయకులు కాకర్ల సురేష్ ట్రస్ట్ సభ్యుల ద్వారా సోమవారం ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కలివేల బాలస్వామి, ట్రస్ట్ సభ్యులు సుమన్, తిరుపతయ్య,గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఉదయగిరి

సెమీ క్రిస్మస్ వేడుకలను ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువ నాయకులు మేకపాటి అభినవ్ రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వింజమూరులోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో భారీ సంఖ్యలో చర్చి మత పెద్దలు నాయకులు కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమీ క్రిస్మస్ వేడుకలు నియోజకవర్గం పరిధిలో వింజమూరులో నిర్వహించడం శుభ సూచకమన్నారు. ఈ పండుగను ఐక్యతతో ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గం క్రిస్మస్ పండుగ జరుపుకునే ప్రతిఒక్కరూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నెల్లూరు పీఠాధిపతులు ఎమ్‌డి ప్రకాశం, జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు షేక్ గాజుల తాజుద్దీన్, మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి, జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి, గౌస్ మొహద్దీన్, ఉపసర్పంచ్ మూర్తుజా హుస్సేన్, వైసిపి నాయకులు క్రైస్తవ సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలకు సిద్ధమైన 130 సంవత్సరాల చరిత్ర కలిగిన సెంటినరీ బాప్టిస్ట్ సంఘము సంఘ కాపరి డాక్టర్. ఎమ్. ప్రేమ్ నాథ్, సంఘ చైర్మన్ డాక్టర్ సి. జోనోతాన్ వారు మాట్లాడుతూఈనెల 25 నుంచి జనవరి 16 వరకు క్రిస్మస్ వేడుకలు జరుగును విద్యుత్ కాంతులతో తేజరిల్లుతున్న మందిరము ఈనెల 24వ తేదీన రాత్రికి క్రీస్తు పొట్టిక నాటిక సండే స్కూల్ పిల్లలు చే ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ సూరి నెహెమ్యా, తుమ్మలపెంట ప్రదీప్, సండే స్కూల్ సూపరింటెండెంట్, డెకన్స్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో సోమవారం కావలి పట్టణం పెంకుల ఫ్యాక్టరీ చెరువు కట్ట గిరిజన సంఘంలో ఉన్న పేదలకు మెగా అయాన్ కొల్లి నాల్గవ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, వలంటీర్లు మున్నా,దుర్గారావు, హేమ, హారిక, ప్రవల్లికలు పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు.

రైతుల ఆందోళన

ప్రజాశక్తి-సంగం : కావలి కాలువ కింద పండించే రైతుల భూములను అధికారికంగా ఆయకట్టులో చేర్చాలని కోరుతూ సోమవారం ...

రైతులతో ఇరిగేషన్ అధికారుల సమావేశం

ప్రజాశక్తి-సంగం : స్థానిక ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం కావలి కాలువ ఇఇ శ్రీనివాసులు, డిఇ వెంకట రమణయ్య కావలి కాలువ రైతులతో సమావేశం నిర్వహించారు. వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి అధ్వర్యంలో అధికారులు కావలి కాలువకు సాగునీరందించే సాధ్యాసాధ్యాలపై రైతుల నుండి పలు సలహాలు సూచనలు ... పరిస్థితి ఉందని తెలిపారు. ప్రస్తుతానికి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని రైతులు అధికారులకు విన్నవించారు. అధికారులు స్పందించి వెంటనే 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను చెప్పిన వెంటనే స్పందించి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించి రైతులకు సాగునీరు విడుదల చేయించిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డికి రైతులు ...

బురదమయంగా సచివాలయం రోడ్డు

ప్రజాశక్తి-జలదంకి

బురదమయంగా సచివాలయం రోడ్డు

జనరల్ నోటీసు

ఎంపి ఆదాల గెలుపును అడ్డుకోలేరు

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: పేదల పెన్నిధి, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి విజయాన్ని అడ్డుకోలేరని 18వ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అశోక్ కుమార్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజక వర్గం నుంచి ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి పోటీచేయడం రూరల్ ప్రజల అదృష్టమని కార్పొరేటర్ అశోక్ కుమార్ చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్, క్లస్టర్-1 ముడియాల రామిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమంలో మారంరెడ్డి కుమార్, కమతం ప్రతాప్ రెడ్డి, షబ్బీర్ బాషా, పఠాన్ బాబూఖాన్, ఆరికొండ మల్లి, ఎద్దల వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది,18వ డివిజన్ స్థానికులు పాల్గొన్నారు.

అబ్దుల్ అజీజ్‌తో డ్యాన్స్ మాస్టర్ జానీ భేటీ..

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ జానీ సోమవారం నెల్లూరు నగరంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిరువురు పలు కీలక అంశాల పై చర్చించారు. ఆయన తో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఉన్నారు.

పేదలకు సహాయం చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ రాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, సమాజ సేవకులు డాక్టర్ పేర్నపాటి శ్రీరామరాజు జన్మదినం సందర్భంగా సోమవారం నెల్లూరులోని రైల్వేస్టేషన్ నందు రోడ్డు పక్కన నిద్రించే అభాగ్యులకు 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిగా విచ్చేసిన విశ్రాంత ఉపకార్మిక కమిషనర్ రావులపాలెం రఘు మాట్లాడుతూ మనసున్న మహారాజు డాక్టర్ పేర్నపాటి శ్రీరామరాజు ఎంతో మంది కళాకారులకు ఇతోధికంగా ఆర్థిక, హార్దిక సహాయం చేస్తున్నారు. ఎటువంటి కళా పోషకులు ఉండడం వల్లే ఇంకా కళలు బతికే ఉన్నాయని, ఇటువంటి వ్యక్తులు సమాజానికి అవసరమని తెలిపారు. మోటివేటర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చలికాలంలో కనీసం ఒంటిమీద కప్పుకోవ డానికి కూడా గుడ్డలు లేని పేదవారికి సహ యం చేయడం ఎంతో తృప్తిగా ఉందన్నారు. భవిష్యత్తులో శ్రీరామరాజు మరెన్నో సేవలు సమాజానికి చేయాలని కోరుకుంటున్నానని వివరించారు. కార్యక్రమంలో వర్షప్రా రియల్ ఎస్టేట్ జనరల్ మేనేజర్ సయ్యద్ ఫిరోజ్ హుస్సేన్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

హరిణి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట స్థానిక భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో సోమవారం బోగోలు అగ్రికల్చరల్ ఏఎంసి రావూరి హరిణి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదరణ కేంద్రంలోని అనాథలకు హరిణి తన కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేసి భోజనం అందజేశారు. ఈ సందర్భంగా హరిణి తల్లితండ్రులు రావూరి శ్రీనివాసులు, వరలక్ష్మిలు మాట్లాడుతూ గత 7 సంవత్సరాల నుండి తనకుమార్తె పుట్టిన రోజు వేడుకలు ఆదరణ కేంద్రంలో నిర్వహిస్తు న్నామని అనాథలకు సహాయపడటం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హరిణి సోదరి దొరసాని, ఆదరణ కేంద్రం డైరక్టర్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి, భవాని, ఆదరణ కేంద్రంలోని సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై ప్రజా విజయం..

-ఆందోళనతో దిగివచ్చిన అధికారగణం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు జనవాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు ప్రయత్నానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో ప్రజలు విజయం సాధించారు. ఆందోళన దెబ్బకు ఎక్సైజ్ శాఖ అధికారులు దిగివచ్చారు. జనవాసాల మధ్య బ్రాందీషాపు ఏర్పాటు చేయబోవ ంటూ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే ...నరుకూరు సెంటర్ కు సమీపంలో 2వ డివిజన్ పరిధిలోకి వచ్చే శ్రీ సాయి బాలాజీ లే అవుట్ లో నెల్లూరు నగరానికి చెందిన కొందరు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యా రు. జనవాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు ప్రయత్నాన్ని స్థానికులు సిపిఎం, ఐద్వా, టీడీపీ, జనసేన పార్టీల మద్దతుతో వ్యతిరేకించారు. అయినా మద్యం వ్యాపా రులు అధి కార వైసీపీ మద్దతుతో మద్యం దుకాణం పెట్టేం దుకు సిద్ధపడ్డారు. దాంతో స్థానికులు ఆందోళనను ఉధృతం చేశారు. ఈ మేరకు పది రోజుల పాటు మద్యం దుకాణం ఏర్పాటు యత్నాన్ని నిరసిస్తూ వివిధ రూపాల్లో ఆందోళనను కొనసాగించారు. దాంతో చేసేదిలేక మద్యం వ్యాపారులు వెనక్కి తగ్గారు. అంతేకాకుండా మద్యం దుకాణం ఏర్పాటు యత్నంపై ప్రజల ఆగ్రహాన్ని గుర్తించిన సంబంధిత శాఖ అధికారులు ఎట్ట కేలకు ఈ ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టబో మని ప్రకటించారు. ప్రజలు ఆందోళనకు సిపిఎం, జనసేన, టిడిపిలతో పాటు ఐద్వా లాంటి మహిళా సంఘాలు ఆందోళన కు మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌బీ, శివకుమారి, జనసేన జిల్లా నాయకులు గునుకుల కిషోర్, లీ గల్ సెల్ నాయకులు చదలవాడ రాజేష్ , తోట పల్లి గూడూరు మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య , ఆటో యూనియన్ నాయకులు రాజా శిబిరానికి విచ్చేసి మద్దతు పలికారు. ఈ నేప థ్యంలో శ్రీ సాయి బాలాజీ లేఅవుట్ లోని నివాస ప్రాంతాల వారు సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు వినతి పత్రం అందచేశారు. దాంతో స్పందించి లే అవుట్లలో బ్రాంది షాప్ ఏర్పాటు చేయబోమ ని హామీ ఇచ్చారు. దాంతో స్థానికులు హర్షం వ్య క్తం చేశారు. తమకు మద్దతు పలికిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

పని చేయకుండానే జీతాలా..

-విచారణ జరిపి నిగ్గు తేల్చాలి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ కార్పొరేషన్ లో ఉద్యోగం పేరుతో పనిచేయకుండానే నెల నెల జీతాలు తీసుకుంటున్నారని వాటిపై విచారణ జరిపి నిగ్గు తేల్చాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు వాటం భేటీ నాగేంద్రబాబు తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో కమిషనర్ వికాస్ మర్మత్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ నేతలతో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర మునిసిపల్ కార్పొరేషన్‌లో సుమారు 700మంది ఉద్యోగులు వివిధ విభాగాల లో పనిచేస్తున్నారన్నారు. దాదాపు వీరిలో 70 మంది ఉద్యోగులు పనిచేయకుండానే నెల నెల జీతాలు తీసుకుంటున్నారని ఈ విషయం మీద తమరు విచారణ జరపాలని కోరారు. కొందరు అధికారుల ప్రత్యేక చొరవతోనే జరుగుతుందని, గతంలో ఇదేవిధంగా ఉంటే అప్పటి కమిషనర్ విచారణకు ఆదేశించగా నేటి వరకు విచారణ రిపోర్టు బయటపెట్టకపోగా,పౌరుగు సేవల ఉద్యోగులు వివరాలను తెలిపే ఫైళ్లు కూడా మాయం చేశారన్నారు .వ్యక్తిగత పనులు చేసుకుంటూ కార్పొరేషన్ లో జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులను కమిషనర్ గుర్తించి వారిమీద శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విషయం మీద త్వరలో వివిధ రూపాలలో ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆప్ రూరల్ నియోజక వర్గ అధ్యక్షులు సంజయ్ కుమార్ , పి.పి.ఐ నాయకులు పి.లీలామోహన్, షేక్.ముక్తి యార్ ,అక్బర్ , రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-ముత్తుకూరు తుపాన్ బాధితులకు నష్టపరిహారం అందించాలని సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి గడ్డం అంకయ్య మాట్లాడుతూ కులాల ప్రాతిపదికన నష్టపరిహారం చెల్లించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ జీఓలను రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కారని తెలిపారు.ప్రధాన ప్రతిపక్షం చలనం లేకుండా ఉందన్నారు. మండలం లోని అన్ని కులాల వారికి తుపాను వరద నష్టపరిహారం సమానంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏ జీవో ప్రకారం

నినాదాలు చేస్తున్న నాయకులు

మండలంలోని కొన్ని కులాల వారికే ఇచ్చి మిగతా కులాల వారికి ఇవ్వలేదో ఆ జీవోను విడుదల చేయాలని తహశీల్దార్‌ను నిలదీశారు. దాదాపు పది రోజులకు పైగా చీకట్లో, నీళ్లలో మగ్గుతూ కాలం వెళ్లదీసిన అనేక దళిత కుటుంబాలకు కనీసం బియ్యం, నిత్యావసర సరుకులు లాంటివి కూడా అందజేయకపోవడం దారుణం అన్నారు.తహశీల్దార్ మాట్లాడుతూ మీరిచ్చిన అర్జీ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి మండలంలో ఉన్న దళితులం దరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడతా మని వారు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు నక్క రాఘవయ్య, షేక్ మస్తాన్ సాహెబ్, ఎస్‌కె సలాం, బి.మోహనయ్య, మన్నే పద్మమ్మ, వెంకమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

సంకల్ప యాత్ర విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-బిట్రగుంట 20వ తేదీ నుంచి నిర్వహించే వికసిత్ భారత సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎంపిడిఓ వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులు, బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, ఎల్పిజి గ్యాస్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శులతో భారత్ సంకల్ప యాత్రపై సమీక్ష సమావేశాన్ని ఎంపిడిఓ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ప్రచారరథం వచ్చేటప్పుడు అవసరమైన ఏర్పాటు చేయాలని తెలిపామన్నారు. ప్రతిఒక్క శాఖ అధికారి ఆ ప్రచార సకటం వచ్చినప్పుడు ఆ శాఖ సంబంధించిన ప్రగతి నివేదికలతో ప్రజలకు అవగాహన

కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, బ్రాంచ్ మేనేజర్, ఎల్పిజి డీలర్లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న మంత్రి కాకాణి

ఆలయాల అభివృద్ధికి కృషి : కాకాణి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమ వారం మంత్రి మండలంలోని విలుకానిపల్లి గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వినాయకుని ఆలయాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం జగన్మోహ న్ రెడ్డి ఆల యాల అభివృద్ధికి పూర్వవైభవం తీసు కొచ్చారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కష్ణా పుష్కరాలు వచ్చినప్పుడు ఘాట్ లు నిర్మించే క్రమంలో విజయవాడలో అ త్యంత పురాతనమైన ఆలయాలను నిలువునా కూలగొట్టారని మంత్రి కాకాణి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాజీ మంత్రి సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై సెటైర్లు వేశారు. వైసిపి నాయకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీనర్ ఉప్పల శంకర య్య గౌడ్, సచివాలయాల కన్వీనర్ తలమంచి సురేంద్ర బాబు, వ్యవసాయ సల హా మండలి చైర్మన్ ప్రసూనా, మాజీ సర్పంచ్ ఈదూరు రామాచార్యులు ఉన్నారు

ప్రచారం చేస్తున్న దృశ్యం

అభివృద్ధి వైపా..అరాచక పాలన వైపా

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ: రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పరుగులు పెట్టించారని.. వైసీపీ పాలనలో అరాచకం సాగిస్తూ.. అభివృద్ధిని మరిచారని దీంతో యువతకు ఉపాధి అవకాశాలు కోల్పోయారని మాజీమంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు చిన్న బజార్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు, టీడీపీ శ్రేణులు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన వీలేకరులతో మాట్లాడుతూ బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళుతుంటే... వారి నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. తాము అడిగేలోపు ప్రజలే తమకు భరోసా ఇస్తున్నారని చెప్పారు. సార్ ఈ దఫా మా ఓటు మీకే సార్... మీ పరిపాలనలో నెల్లూరును ఎంతో అభివృద్ధి చేశారని ప్రజలే చెబుతున్నారని తెలిపారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కనిపించడం లేదని ప్రజలు నిరాశ చెందుతు న్నారన్నారు. ప్రస్తుత పాలనలో కనిపించడం లేదన్నారు. ప్రజలంతా ఓ సారి ఆలోచించి అభివృద్ధి చేసిన చంద్రబాబు వైపు నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, తాళ్లపాక అనురాధ, ధర్మవరపు గణేష్ కుమార్, చంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుగ్గిశెట్టి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గి శెట్టి సుజయ్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని జనసేన జిల్లా కార్యాలయంలో జన సైనికులు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ చేశారు. తప్పెట్లు , బాణసంచా కాల్చి ఆయనకు ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. జన సేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మను క్రాంత్ రెడ్డి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొట్టె వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి షేక్ అలియా, రాష్ట్ర నాయకులు సుందర రామి రెడ్డి, తదితరులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. మను క్రాంత్ రెడ్డి .. సుజయ్ బాబు చేత భారీ కేక్ ను కట్ చేయించి తినిపించారు. అనంతరం పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు , ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్లు, బిస్కెట్స్ పంపిణీ , అభాగ్యులకు చీరలు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.